# దిగిన మెట్లు

నాలో నీకు యే మాత్రం గౌరవం వున్నా, వెంటనే బయల్దేరి రమ్మన్నాడు అన్నగారు. అయితే యీ రమ్మనటం ఎందుకో, ఎన్నిరోజుల్లో మాత్రం ఆయన సూచనగానైనా తెలీపర్చలేదు, ఆ వుత్తరంలో. తనేం చెయ్యాలి? అన్నగారిలో తనకి యేమాత్రం గౌరవం తగ్గలేదని రూఢిగా తెలుసు, అట్లాంటివాడికి, వెంటనే బయలుదేరి వెళ్ళటం తప్ప మరోదారి ఎట్లా కనిపిస్తుంది?

సత్యనారాయణ కోర్టుతాలూకూ పన్లన్నీ గుమాస్తాతో వివరంగా చెప్పేసి బయల్దేరినాడు. జానకి, 'రెండురోజుల్లో వచ్చేస్తారు కదూ?' అన్నది,

'వీలయితే. తిరుగుబండిలో వొచ్చేస్తాను. నాకు ఊరుదాటి, అవత లుండటం మనసా? ఒరే, బాబీ-నీకు బిస్కట్లపొట్లం తెచ్చాగాని, యీ రెండు రోజులూ అల్లరిచెయ్యకేం?-' బాబిగాడు గిర్రున తలూపాడు.

'ఎక్కడికి నాన్నా?'

"పెదనాన్నగారి వూరువెళ్ళొస్తా-ఆడుకో, వొస్తాను మరి!"

సత్యనారాయణ స్టేషను చేరుకునే సరికి బండికింకా అరగంట పైగా టైముందని తెలిసింది.

అన్నగారెందుకు రమ్మని రాసుంటాడు?

ఒక్కగంట ఓపిక పట్టితే చాలు, తనూ పోయి అన్నగారి ప్రక్క కూర్చుని, విషయం తెలుసుకోగలడు. కాని, ఆగదు మనసు. ఊహలు ఉరకలు వేస్తాయి. ఒక ప్రపంచాన్నే సృష్టిస్తాయి అవి. ఇంట్లో ఎవరికన్నా జబ్బుగాలేదుకదా! –బహుశా కాదు. అదే అయితే, తనకి అన్నగారిలో వున్న నమ్మికతో దానికేం పని ? - రైల్లో ఎక్కాకకూడా యిదే ఆలోచన! తదితరం యేదీ గుర్తురాదు. దీనిముందు అన్నీ కేన్సిల్ అయినాయిగావును!

సరిగ్గా అరగంట అయింది బండిలో కూర్చుని. ఊరు వచ్చేసింది. దిగి తిన్నగా స్వంత యింటవైపు నడిచాడు.

అన్నగారు యింట్లో లేడు ఎదో పనిమీద బజారుకెళ్ళినాట్ట! "వొచ్చే వేళే" అన్నది వదినగారు. తన అనుమానం మాత్రం తీరలేదు. ఆవిడ చెప్పలేదు, ఎందుకు పిలిపించారో తనని యిక్కడికి.

"సుశీలేది?" ఛప్పున గుర్తు వొచ్చింది, దాని సంగతి.

"ఇప్పుడే పక్కవాటా వాళ్ళింటి కెళ్ళింది .. పిలుస్తాను" అన్నది వదినగారు,

సుశీల వొస్తూనే "ఓ! బాబాయొచ్చాడే!" అన్నది.

"తెలీదేమిటి నీకు?"

"ఊహు—"

"ఏంతెచ్చానో చెప్పుకో చూదాం?"

"పూలు! అవునా ? నాకియ్యి, అన్నీ నేనే పెట్టుకుంటా—"

జానకి భద్రంగా కట్టియిచ్చిన పూలమాలలు వప్పజెప్పాడు సత్య నారాయణ. సుశీల తల్లిదగ్గరకు పరిగెత్తింది.

"ఉత్తరం రాసినవాడు, వచ్చేవేళకి వుండొద్దూ?" అనుకున్నాడు.

"బాబు కులాసాగా ఆడుకుంటున్నాడా!" లోపలనుంచి అడిగింది.

"ఆ! అన్నయ్య నా కెందుకు ఉత్తరం రాసినట్టు?"

"ఉత్తరం రాశారా? నాకు తెలీదే!"

"నిన్ననే అందింది. బయలుదేరి రమ్మన్న ముక్క తప్పితే, మిగతా అంతా వొట్టి తెల్లకాగితమే" అన్నాడు.

"ఎందుకనో?"

"అదే నాకు తెలీదు—"

"చిత్రంగా వుండే మనిషి తరహా. ఏంచేసేదీ ఇంట్లో ససేమిరా చెప్పరు. నాలుగురోజులై వేళకి యింటికి రావటంకూడా లేదు. ఇవ్వాళ మట్టుకు?-అప్పుడే పదకొండున్నరయింది!"

అవును. పదకొండున్నరే అయింది. ఆయనేదో వ్యవహారాలమీద తిరుగుతుంటాడు. ఆస్తి యాజమాన్యం యేమంత తేలికయిన పని?

అనుకున్నంత సేపు పట్టలేదు, ముకుందరావు వొచ్చేందుకు.

"ఆ! ఒచ్చావా? అనుకుంటూనే వున్నాను. రైట్!"అన్నా డాయన.

అదేముక్క! భోజనాలదగ్గరగాని, ఆ తరవాతగాని మరోమాటే అడ లేదు ఆయన!

తనే అడిగితే? తినబోతూ....? ఏమంత తొందర....పిలిచినవాడు చెప్పకుండానే వుంటాడేమిటి? అట్లాగైతే, తనకింకా నయం!

భోజనం అయ్యాక, "ఓగంట నిద్రపో, తర్వాత మాటాడు కుందాం!" అన్నాడు, మంచం వాల్చుకుంటూ, తనకి నిద్రపట్టలేదు. ఎట్లా?

విషయం తెల్సుకునేందుకే తనకింత ఆదుర్దా అయితే, చెప్పేందుకు సహజంగా ఆయన కెంతుండాలి? కానిలేదు, గట్టిగా నిద్రపోతున్నాడు. చిట్టచివరికి ఒంటిగంటన్నర అయింది.

ముకుందరావు లేచాడు, వెంటనే సత్యనారాయణా

"మరేంలేదు, ఎందుకట్లా ఉత్తరం రాశానో నీకు ఆశ్చర్యంగా ఉందా? అట్లారాయక, అసలు విషయమే రాస్తే, నా ముఖం చూడనే చూడవని తెలుసు."

ఎందుకింత కఠినంగా మాట్లాడుతాడు యీయన? సత్యనారాయణకు తలవూపటం తప్ప మరేం చేతకాలేదు. నోరు బిగబట్టి పోయుండాలి!

"నాన్నపోయి ఆర్నెల్లు దాటింది!" - ఈ విషయం తనకెంత తెలుసో, లోకానికి అంతే తెలుసు? - కాని తనకి కన్నీళ్ళెందుకూ వొస్తున్నై? అనురాగం, తనయందు ఆయనకున్న మక్కువ, రప్పిస్తున్నాయి వాటిని. కొడుకుల సుఖంకోసం, ఆనందంకోసం ఎంతయినా త్యాగంచేసిన గొప్ప మనిషి!

"నాన్న వుండగా యింత పెద్ద ఆస్తిని ఎట్లానో 'మేనేజి' చెయ్యగలిగాడు. ఇప్పుడేముంది - "

అయితే....?

"నా వుద్దేశంలో ఎవరిభాగం వాళ్ళు తీసుకొని, పాలన చేసుకోటం నయం. ఏరోజుకేం జరగగలదీ మనకేం తెలుసు? అనుమానాలకు ప్రపంచంలో ఎక్కువస్థానం వుంది. అదీగాక, నా ఆస్తి యింకా పెంచుకునే వుద్దేశ్యం వుంది నాకు; ఏంచేసినా వొంట్లో శక్తి పూర్తిగా ఉడిగిపోకముందే చెయ్యాలిగదా! .. కాబట్టి ఆస్తి పంచి యిచ్చేస్తాను-నీ వాటా...."

ఏమిటిదంతా? తను వింటున్నమాటలు. ఎన్నడేనా జీవితంలో వింటానని అనుకున్నవేనా? తన అన్నకింత స్వార్థం ఎట్లా ఏర్పడింది? తనంటే, యీసడింపు ఎందుకాయనకి? తనకు ఎంత గౌరవం వుంటే, యిట్లా బయల్దేరి వస్తాడు?.... కాని, యివన్నీ లోపలి ఆలోచనలు. ఒక్కటీ బయటికి రాదు. గొంతులోంచి వూడిపడదు చెప్పేందుకు.

"నాకు తెలుసు! నీకు నాలో గొప్పవిశ్వాసం వుంది. నేనంటే నీకేమి అపనమ్మకం లేదనికూడా తెలుసు. అయినా మరి లోకం సంగతేమిటి? నీ లెక్కలుగూడా నేనే రాయటం భావ్యంకాదు. నా వుద్దేశ్యం యింతకుముందే చెప్పాగదా!...." ఆగింది ఆ కర్కశ పదజాలం,

ఈ స్వస్తివచనం చెప్పేందుకా తన్ను హడావిడిగా పరుగెత్తుకు రమ్మన్నది? తనెంత మోసగింపబడుతున్నాడు? ఉహు-మాట్లాడక తప్పదు. యితనైనా?

"ఏం, ఎందుకిది? నాలో యేం లోపం వుందని?"

"కలవరపడకు, ఆదుర్దాపడాల్సిన అవుసరం యీషణ్మాత్రమైనా లేదు. శాంతంగా నేను చెప్పిన మాటలన్నీ ఆలోచించుకో, నీకు అసమంజసంగా తోచకపోతే ధన్యుణ్ణి...."

తన మనస్సును ఛిన్నాభిన్నం చెయ్యగల మాటలు ఒక్కొక్కటే ఎంత ప్రశాంతంగా, నేర్పుగా విసరుతున్నా డాయన! తనకి ఉద్రేకం కలగదేం?

"ఒద్దు నా కిష్టంలేదు."

"మూర్ఖంగా వొద్దనకు, ఇందువల్ల యిద్దరికీ యెంతోలాభం. భాగాలు పంచుకొన్నంత మాత్రాన మనకేం కక్షలుండాలని శాసనంలేదు. కేవలం మనస్సు సమాధాన పర్చుకునేందుకే యీ యేర్పాటు!"

మనస్సు సమాధాన పడికాక ఎట్లావుంది ?

తనేమిటి?- తెలీదు, ఎంతో, యేమిటో తండ్రి సంపాయించింది తన కది అవసరంలేదు. ఆయన దయవల్ల తను బి, యే; బి, యల్. అయి బోర్డు కట్టినాడు. నాలుగు రాళ్ళు తెచ్చుకోగలడు. సంసారాన్ని హూందాగా నడుపు కోగలడు! ఈ బెడదంతా తనకెందుకు! ఈ ఊబిలో కోరి తానెందుకు దిగాలి?

"అట్లా బజారుకెళ్ళొస్తాను. ఆలోచించుకో" అన్నా డన్నగారు,

"అక్కర్లేదు. ఏమీ ఆలోచించాల్సింది కనుపించదు. ఆస్తి రెండు ముక్కలుగా చెయ్యాల్సిన ఖర్మం యేమిటీ? నాకు విభజన సిద్ధాంతంలో నమ్మకంలేదు!" అన్నాడతను.

ఈమాటలేమీ గమనించకుండానే ముకుందరావు వెళ్ళిపోయినాడు. కోరి తను యీ నరకం ఎందుకు సృష్టించుకున్నాడు ? అన్నగారు యింత మొండిమనిషా?

విభాగాలు వొద్దన్నా యీయన వొప్పుకొనేట్టులేడు కాని, తనకది సుతరామూ యిష్టంకాదు.

"తన ఆస్తి పెంచుకుంటాట్ట? —విభాగాలు జరగకుండా వుంటే, అదంతా తనదేనని వాటా అడుగుతా ననుకున్నాడా యేమిటి? ఆ మాత్రం నీతీ, నిజాయితీ లేకుండా చేస్తున్నానని గాబోలు ఆయన వుద్దేశం ప్లీడరుపని? ఏమయినా సరే। నీటముంచినా, పాలముంచినా ఆయనదే భారం. భూములు

విషయంలో నాకేమీ సంబంధం లేదు. వాటిమీద ఆదాయం ఒక్క దమ్మిడీ నేను నా స్వంత ఖర్చులకి వినియోగించుకోను. ఆయనిష్టం వచ్చినట్టు అఘోరించనీ, నాకేం ఇబ్బంది లేదు—'' అనుకున్నాడు సత్యనారాయణ.

ముకుందరావు తన మాటలు విత్‌డ్రా చేసుకోలేదు. అలా చేసుకోవాల్సిన అవసరం ఆయనకు లేదు. మంచి చెబితే సత్యనారాయణ ఎందుకు వినక పోవాలి? తన ''అన్న'' గౌరవం వాడే నిలబెట్టినట్టు? తను యిన్ని ప్రయత్నాలు చేసి.. వృథా అయిపోవలసిందేనా?

''నాకు రైలు టైముంది. నే పోవాలి. ఆ స్తిమాత్రం సరికెయ్యటానికి నాకిష్టం లేదు—''

''అలాగా? ఆ స్తి కలిసి వుండటం నాకిష్టం లేకపోతే?''

''నాకా ఆస్తిలో పిసరయినా అక్కర్లేదు. చిల్లిగవ్వ యింతవరకూ దానిలోనుంచి నేను ఉపయోగించుకో లేదు, యికముందు ఉపయోగించను కూడా! నన్నీవిషయంలో మళ్ళీ హెచ్చరించాల్సిన అవసరం లేదు. కోర్టు కెక్కినా నా అభిప్రాయాలు మారవు!'' అనేసి, సత్యనారాయణ మెట్లుదిగి వెళ్ళిపోయినాడు స్టేషను వైపుకు. ముకుందరావు యీ రకమైన పర్యవసానాన్ని ఆశించలేదు. తను చెప్పింది తమ్ముడు కాదనడన్న విశ్వాసం ఆయన హృదిలో గూడు కట్టుకునుంది మరి! ఏం చెయ్యాలి? మూర్ఖుడు.......

*　　*　　*

అన్నదమ్ముల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు సన్నగిల్లినై. ముకుందరావు సత్యనారాయణని క్షమించాడో లేదో తెలియలేదుగానీ తమ్ముడుమాత్రం అన్నగార్ని యీజన్మలో క్షమించలేదు. ఆ స్వార్థం, సంకుచితదృష్టి, అతనికి గిట్టవు. సత్యనారాయణ మటుకు యేం చేయగలడు?

నలుగురు కూతుళ్లు; ముగ్గురికి పెళ్లిళ్ళు అత్యవసరం. పెద్దకొడుకు కాలేజీ చదువుకు డబ్బు కావాలి. రోజులు వెనుకటి మోస్తరు లేవు. సంపాదన తగ్గిపోయింది. పెద్దవాడై నాడు, కింది తరం ప్లీడర్లు కేసులు అలాగ్గా కొట్టేస్తున్నారు.

జానకి చెప్పగలిగింది మాత్రం యేముంది?

"మీ అన్నయ్య దగ్గరున్న ఆస్తిఎంత?" అన్నదోసారి.

"నాకుమాత్రం తెలుసా యేమిటి? అయినా దాన్ని నేను ముట్టుకోను!"

"ఎలా గడుస్తుందీ? మన సొమ్ము మనం తినేందుకే అర్హత లేదేమిటి? ఏనాడో శపథం—అయినా అదేం శపథమా? - చేశామని యీనాడు బిర్ర బిగుసుకుంటే, సంసారం ఒడ్డెక్కేదెలా? నాకుమాత్రం అదేదారి కనిపిస్తోంది!"

ఒక ప్రక్క మాట పట్టుదల పీడిస్తూంది. మరోప్రక్క ఆర్థిక సంక్షోభం! ఏపరిస్థితుల్లోనైనా మనిషిని కుంగదీయగలది-ఆర్థికత! బానిసత్వం, మార్గలేమి బంధించాక, మానవత్వం మంటగలిపినట్టేగాని మరొకటికాదు.

డబ్బుకావాలి! రోజూ తనకి వందలకొద్దీ ఖర్చు!

ఏమిటిదారి? అన్నగారికి ఉత్తరం రాయటం ఒకటే కనిపిస్తోంది.

ఆరోజున, తనామాటలకు ఒప్పుకున్నట్లయితే యీ పరితాపం, మానసిక సంవాదన లేకపోను! తన ఆస్తి ఉద్ధరించగలిగేది తనని. రెక్కలాడి, పది డబ్బులు విసురుగా జేబులోపడుతున్న రోజున తనకేమీ బేఫరవా కనిపించ లేదు. ఈ నాడు?

అన్నగారేమంటాడో? ఏమంటాడు? పిత్రార్జితం, దావావేసి సైతం లాక్కుందుకు తనకి అర్హత వుంది.

ఈమాటతో అతని సంస్కారం పూర్తిగా దెబ్బతిన్నట్లు ఫీలైనాడు.

అన్నగారు తనకు చేయదలచిన అపకారం యేమీలేదు. పైగా చేస్తా నన్న ఉపకారం తన చేజేతులా పోగొట్టుకున్నాడు. ఇప్పటికి ఆయన ఆస్తి ఎంత పెరిగిందో యేమో!

ఆరోజున పిత్రార్జితం మీదే ఆశపెట్టుకునున్న అన్నని చూచి తను తిరస్కారభావం చూపాడు. ఈనాడేమైంది ? తనిన్నాళ్ళూపడ్డకష్టం తెచ్చిం దేమీలేదు. కాలుమీద కాలువేసుక్కూర్చున్న అన్నగారు ఆస్తి పెంచుకున్నాడు.

తనడబ్బు, ఇన్నాళ్ళూ తన అజ్ఞానానికి అన్నగారింట్లో మూలుగు తున్నడబ్బు— ఈ నాడు తానుచెయ్యిజాపగానే సిద్ధంగా వుంది రావటానికి! ముకుందరావుని మించిన ధర్మరాజు మరిలేడు! *

(సుభాషిణి)